

14 బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో 14 బార్ల లైసెన్స్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సిహెచ్.తిరుపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలో 8 బార్లు, ఆర్‌ఇటి రూ.55 లక్షలు, పలాస 2 బార్లు ఆర్‌ఇటి రూ.55 లక్షలు, ఆమదాలవలస రెండు బార్లు ఆర్‌ఇటి రూ.35 లక్షలు, ఇచ్ఛాపురం రెండు బార్లు ఆర్‌ఇటి రూ.35 లక్షలుగా పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ లోపు అన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 15వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రూ.ఐదు లక్షల దరఖాస్తు రుసం, రూ.పది వేల ప్రాసెసింగ్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

యూరియాపై గందరగోళం

- కొరత లేదంటూ అధికారులు సమర్థన
- కేంద్రం నుంచి వస్తోందంటూ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన
- రైతులకు అందని యూరియా
- పక్కదారి పట్టిన ఎరువులపై తేలని లెక్కలు

జిల్లాలో ఎరువులు ముఖ్యంగా యూరియా కొరతపై ప్రజాప్రతినిధులు, అధికారులు తలోరకంగా చేస్తున్న ప్రకటనలు రైతులను గందరగోళ పరుస్తున్నాయి. యూరియా కొరత లేదంటూనే వ్యవసాయశాఖ మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్రం నుంచి పది వేల మెట్రిక్ టన్నులు వస్తోందంటూ చెప్తున్నారు. యూరియా సకాలంలో రాకపోవడం వల్లే ఈ కొరత తలెత్తిందన్న విషయం స్పష్టమవుతోంది. ఎరువులపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ లెక్కలతో సహా చెప్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు ఒక బస్తా యూరియా దక్కడమే కష్టంగా మారింది. అధికారులు చెప్పినట్టుగానే జిల్లా అవసరాలకు సరిపడా యూరియా వస్తే అవి ఏమయ్యాయనేది లెక్కలు తేల్చే పనిచేయడం లేదు. ప్రభుత్వం పంపిణీ కేంద్రాలకు పంపిన యూరియా గుట్టుచప్పుడు కాకుండా పక్కదారి పట్టినట్టు రైతులు ఆరోపిస్తున్నా, వాటి సంగతి చూడడం లేదు. దీంతో లెక్కల్లో యూరియా కనిపిస్తున్నా, రైతులకు మాత్రం అవి అందడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఎరువులకు సంబంధించి అధికారులు చెప్తున్న వివరాల ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్‌లో మొదటి, రెండో విడత కలిపి 20,481 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 24,421 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయి. ఇందులో రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలు వంటి ప్రభుత్వ పంపిణీ కేంద్రాలకు 11,792 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 12,629 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల వద్ద 415.3 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 111.6 మెట్రిక్ టన్నులు, బఫర్‌లో 477 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1,003 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు యూరియా కొరత లేదని చెప్తున్నారు. రాష్ట్రంలో, జిల్లాలో యూరియా కొరత లేకపోతే యూరియా పంపాలంటూ



వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావుకు ఎందుకు లేఖ రాసినట్లు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యూరియా కొరత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం గత నెల 28న రాష్ట్రానికి 10,350 మెట్రిక్ టన్నుల యూరియా పంపింది. మొత్తం మీద వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారుల ప్రకటనలు రైతులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయి.

పక్కదారి పట్టిన యూరియా

ప్రభుత్వ పంపిణీ కేంద్రాలకు యూరియా వచ్చే నాటికి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో, రైతులెవరూ వాటి కొనుగోలుపై దృష్టిసారించలేదు. గత నెల మూడో వారం నుంచి వరుస అల్పపీడనాలతో వర్షాలు కురుస్తుండడంతో రైతులకు యూరియా అవసరం ఏర్పడింది. అప్పటికే యూరియా గ్రామాల్లో పలుకుబడి ఉన్న నేతలు, వారి బంధువుల ఇళ్లకు చేరిపోయింది. దీంతో యూరియా కోసం కేంద్రాలకు వెళ్లిన రైతులకు నిరాశే మిగిలింది. ప్రభుత్వ పంపిణీ కేంద్రాల్లో యూరియా నిల్వలు నిండుకోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాల వైపు పరుగులు తీశారు.

వేలిముద్రలు తీసుకోకుండానే అమ్మకాలు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత పంపిణీ కేంద్రాలకు వచ్చిన ఎరువులను రైతుసేవా కేంద్రం సిబ్బంది ఎటువంటి వేలిముద్రలు వేయకుండానే పంపిణీ చేసినట్లు తెలిసింది. ఇదే ఎరువులు పక్కదారి పట్టడానికి దారితీసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్‌ఎస్‌కెలు, పిఎసిఎస్ వంటి ప్రభుత్వ పంపిణీ కేంద్రాల్లో చాలాచోట్ల ఈ-పోస్ యంత్రాలు లేవు.

రైతుల పేర్లు, ఆధార్ నంబర్లు రాసుకుని ఎరువులు అందించారు. దీంతో సిఫార్సులు, గ్రామాల్లో పలుకుబడి ఉన్న నాయకులు చెప్పినట్టు గానే సిబ్బంది ఎరువులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో సామాన్య రైతులకు ఒక్క బస్తా యూరియా అందడం కూడా గగనమైపోయింది.

ప్రైవేట్ దుకాణాల్లో నిల్వలపై తనిఖీలేవి?

యూరియాకు విపరీతమైన డిమాండ్ నెలకొనడంతో ఇదే అదనుగా వ్యాపారులు సాధారణ ధరపై రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. బస్తా యూరియాను ప్రభుత్వం రూ.275కు అందిస్తుండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.500కు యూరియాని విక్రయిస్తున్నారు. అదేవిధంగా డిఎపి ప్రభుత్వం రూ.1350కి విక్రయిస్తుండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1600 పైబడి అమ్ముతున్నారు. ప్రైవేట్ దుకాణాల్లో నిల్వలు, అమ్మకాలపై విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేశామని అధికారులు చెప్తున్నా ఫలితం కనిపించడం లేదు. దుకాణాల్లో ఎంత పరిమాణంలో యూరియా ఉండాలి?. ఎంత ఉందనేది లెక్కలు బయటకు రావడం లేదు. పెద్దమొత్తంలో యూరియా పక్కదారి పట్టిందన్న ఆరోపణల నేపథ్యంలో దీనిపై అధికారులు కనీసం విచారణ చేయడం లేదు.



బూర్జలో రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

'ఎన్‌టిఆర్ వైద్యసేవ'ను విస్తరించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

పేదలకు అందిస్తున్న ఎన్‌టిఆర్ వైద్యసేవను మరింత విస్తరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. పట్టణంలోని జిల్లా కేంద్రాస్పత్రిలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలు విభాగాల పరిస్థితులను పరిశీలించారు. ముందుగా ఒపి విభాగాన్ని పరిశీలించి, రోగుల నమోదు, వైద్యుల వద్దకు పంపిణీ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. రక్తనిధి కేంద్రం, సిటి స్కాన్, అన్ని విభాగాల్లో సేవలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సూచిక బోర్డులు సక్రమంగా లేవని వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలను ఇంటి వాతావరణంలా శుభ్రంగా ఉంచాలని సూచించారు. రోగుల అవగాహన కోసం గోడలపై అతికించిన పోస్టర్ల స్థానంలో గ్లాస్ గ్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు కలెక్టర్ శంకుస్థాపన చేశారు. జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ఆస్పత్రికి అవసరమైన అత్యవసర వైద్య పరికరాలు, ఫర్నిచర్ సామగ్రిని మంజూరు చేశారు.



కాలువలోని పూడికలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బాలల సత్వర చికిత్స కేంద్రం పరిశీలన

బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని సందర్శించి దంత చికిత్స, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, వినికిడి పరీక్షలు, ఇసిజి వంటి విభాగాలను పరిశీలించారు. మతిమరుపు, వంశపారంపర్య వికలాంగతతో బాధపడుతున్న చిన్నారులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల రాక సౌలభ్యం కోసం మెట్ల వద్ద ర్యాంప్ నిర్మించాలని, వాహనాల పార్కింగ్‌ను లోపలకు అనుమతించకుండా బయటే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత, సమన్వయ అధికారి కళ్యాణ్ బాబు, ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావు, ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ ప్రకాష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత... సామాజిక బాధ్యత

ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇంటి పరిసరాల పరిశుభ్రతను విధిగా పాటించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పట్టణంలోని భైరవీధిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ చెత్త సేకరణకు ఇంటింటికీ వస్తున్నదీ, లేనిదీ ప్రజలను అడిగి ఆరా తీశారు. వీధి కూడలి వరకు వచ్చి పారిశుధ్య కార్మికులు వెళ్లిపోతున్నారని, వచ్చే సమయం తెలియక చెత్త అందజేయలేకపోతున్నామని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

వీధి చివరి వరకు వెళ్లి చెత్త సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించకపోతే కలిగే అనర్థాలను ప్రజలకు కలెక్టర్ వివరించారు. వారం రోజుల్లో మళ్లీ వీధిలో పర్యటిస్తానని, పారిశుధ్యం మెరుగుపడేలా స్పష్టంగా కనిపించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవన అనుమతులు ఉన్నవి, లేనిదీ పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ అలివేలు, ఇఒపిఆర్‌డి గోపీబాల, డిఎల్‌పిఒ ఐ.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

6న చలో విజయవాడ

ప్రజాశక్తి - పాతపట్నం

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6వ తేదీన చలో విజయవాడ చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.కరేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. పాతపట్నంలోని జూనియర్ కళాశాలలో బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు, ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. విద్యార్థుల ఫీజులు యాజమాన్యాల ఖాతాల్లోకి జమ చేస్తామని హామీనిచ్చినా, ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని విమర్శించారు. దీంతో ఫీజులు కడితేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు తేల్చిచెప్పడంతో, ఫీజులు చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్రలో నేటి విద్యాశాఖ మంత్రి లోకేష్ 77 జిఒను రద్దు చేసి, పిజి ఎక్కడ చదువుకున్నా ఫీజులు చెల్లిస్తామని, అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో దీన్ని అమలు చేస్తామని హామీనిచ్చి ఇప్పుడు నోరు మెదపడం లేదని విమర్శించారు. వేలాది మంది విద్యార్థులకు పిజి చదువును కలగానే కూటమి ప్రభుత్వం మిగిల్చిందన్నారు. సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను రూ.మూడు వేలకు పెంచాలని కోరారు. హాస్టళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీలో ఖాళీగా ఉన్న విసి, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులందరికీ ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జాహ్నవి, పూజ, భారతి, చరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సకాలంలో ఎరువులు అందించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలకమన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో రైతు సమస్యలు పరిష్కరించకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఎరువులను కూటమి నాయకులు బ్లాక్ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, పంపిణీలోనూ అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ప్రతిపక్షంగా పోరాటం చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించడానికి బయలుదేరిన వైసిపి నేతలను అడ్డుకొని కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎరువులు పరిమితికి మించి అందుబాటులో ఉన్నాయని పత్రికల్లో చెప్పినా రైతులకు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. వైసిపి హయాంలో ఎరువులు, విత్తనాలు సమయానికి అందించడమే కాకుండా క్రాప్ ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారని చెప్పారు. రైతుల సమస్యలపై వైసిపి నిరంతరం పోరాటం చేస్తుందని, కేసులు, అరెస్టులు తమను వెనక్కి నెట్టలేవని స్పష్టం చేశారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, పొడుగు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, దుంపల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక వేధింపులు అరికడదాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం : పిల్లలకు చిన్న వయసులోనే న్యాయపరమైన అవగాహన కల్పించడం సమాజ భవిష్యత్ కోసం ఎంతో అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన నగరంలోని గర్ల్స్ హైస్కూల్‌లో బాలికలకు న్యాయ అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు చట్టాలు ఎంత కఠినంగా ఉన్నాయో వివరించారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, చట్టరీత్యా పడే శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. సమాజంలో ఈ చెడు సంప్రదాయాన్ని అరికట్టడానికి బాలబాలికల నిరాకరణ అత్యంత కీలకమని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, ప్రిన్సిపాల్ పి.సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

- అమెరికా సుంకాలను తిప్పికొట్టాలి
- 11న విజయవాడలో ఆక్వా రైతుల సదస్సు
- ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

భారతదేశ విదేశీ ఎగుమతులపై అమెరికా 50 శాతం పన్నులు విధించడం దారుణమని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, జి.పోలారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫెండా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధర కొనుగోలుకి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న విజయవాడలో నిర్వహించే ఆక్వా రైతుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను స్థానిక రైతుసంఘం కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో రొయ్యలు చెరువులు ఉన్నాయని, వీటిపై ఆధారపడి పదివేల మంది జీవిస్తున్నారని తెలిపారు. రొయ్యల ఎగుమతిపై అమెరికా వేసిన పన్నులు పైకి 50 శాతంగా కనపడుతున్నా, ఆచరణలో ఇతర పన్నులతో కలిపి 59.72 శాతం అవుతోందని తెలిపారు. ఈ పన్నుల భారం మన దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుందని, ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. మొత్తం ఉత్పత్తిలో 70 శాతం దేశ ఎగుమతుల్లో 60 శాతం మన రాష్ట్రం నుంచే జరుగుతోందన్నారు.

ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల్లో భాగస్వామిగా ఉన్న మనపై ఏకపక్షంగా ఇంత ఎక్కువ శాతం పన్నులు వేయడానికి చట్టరీత్యా అవకాశం లేదన్నారు. చైనా, కొన్ని చిన్న దేశాల మాదిరిగా పన్నులకు ప్రతిగా పన్నులు వేసే ధైర్యం బిజెపి ప్రభుత్వం చేయడం లేదని చెప్పారు. అమెరికా సుంకాలను తిప్పికొట్టాలన్నారు. అమెరికాకు ఎగుమతి అయ్యేది 20, 30 కౌంట్లు గానీ ఎగుమతి చేసే కంపెనీలు ఇతర దేశాలకు ఎగుమతి చేసే ధరలనూ బాగా తగ్గించి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యలు ఇతర దేశాలకు ఎగుమతులపై ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. వ్యవసాయ, ఆక్వా రంగాన్ని ఆదుకునే ప్రయత్నాలు ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఆక్వారంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించి రైతులు, రైతుసంఘాల ప్రతినిధులతో సమస్యలపై చర్చించాలని కోరారు. మార్కెట్ యార్డుల్లో, సొసైటీలో శీతల గిడ్డంగులు నిర్మించి రైతాంగానికి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మురళి, కోటేశ్వరరావు, ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

అధికార పార్టీ అనుయాయులకే ఎరువులు

మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో ఎరువుల పంపిణీ విషయంలో పారదర్శక త పాటించలేదని పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ డిమాండ్‌కు తగ్గ ఎరువుల సరఫరా చేపట్టలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో నిర్వహించిన సమావేశానికి వ్యవసాయశాఖ అధికారి గైర్హాజరు కావడంపై దండు గోపాలపురం సర్పంచ్ మార్పు అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఆర్‌ఎస్‌కెల వద్ద టిడిపి నాయకులే తమ అనుచరులకు ఎరువులు పంపిణీ చేస్తూ, మిగతా రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. దీంతో వేలాది మంది రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని సభలో ప్రస్తావించారు. గత కొద్ది నెలలుగా ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనం ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని సభ్యులు నిలదీశారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్ పాటించకుండా టిడిపి నాయకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని వైసిపి సర్పంచ్‌లు ప్రశ్నించారు. గత ఐదేళ్లలో తమను పట్టించుకోలేదని, ఇప్పుడు మాత్రం ప్రోటోకాల్ గుర్తొచ్చిందా? అంటూ టిడిపి సభ్యులు ప్రతిస్పందించడంతో కొంత గందరగోళం నెలకొంది. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులపై సభ్యులు ప్రశ్నించారు. పంచాయతీరాజ్‌శాఖ చర్చలో గ్రామాల తీర్మానాలు చేసిన పనులకు కూడా అధికారులు సహకరిం చడం లేదని భావనపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, ఆర్.హెచ్. పురం సబ్మిట్ ఎన్ని మన్మథరావు అభిప్రాయపడ్డారు. విద్యుత్, లోవోల్టేజీ సమస్యలపై కూడా సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలకొకసారి నిర్వమించే ఈ సమావేశా లకూ మండల స్థాయి అధికారులు హాజరుకాకపోవడాన్ని సభ్యులు నిలదీశారు. దీనిపై మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సభకు రాని అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపిడిఒ జయంతిప్రసాద్, వైస్ ఎంపిపిలు పొందల తులసమ్మ, నక్క చింతామణి, ఎంఇఒ చిన్నవాడు, ప్రత్యేక ఆహ్వానితులు మేరుగు అప్పారావు పాల్గొన్నారు.



నిలదీస్తున్న సభ్యులు

9న వైసిపి నిరసనలు

ప్రజాశక్తి - నరసన్నపేట

రైతుల కష్టాలను పట్టించుకోని టిడిపి కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల తొమ్మిదో తేదీన పలాస, టెక్కలి రెవెన్యూ డివిజన్లలో నిరసనలు చేపట్టనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. నరసన్నపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో టెక్కలి, పలాస నియోజకవర్గ సమన్వయకర్తలు పేరాడ తిలక్, సీదిరి అప్పలరాజుతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆందోళనల సందర్భంగా వినతిపత్రాలు స్వీకరించి ఆయా రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలకు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఆందోళనల ఉద్దేశమని తెలిపారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు ఎరువులు, విత్తనాలు సహా అన్నీ సులభంగా లభించేవన్నారు. ఇప్పుడు రైతులకు అవసరమైన యూరియా అందించలేకపోతుందని విమర్శించారు. రైతులకు యూరియాను అందించకుండా టిడిపి నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర విజయం సాధించడంతో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ ఆధ్వర్యాన ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో బుధవారం విజయోత్సవ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యంలో ఓటు చోరీ జరిగిన నేపథ్యంలో రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన 1300 కిలోమీటర్ల ఓటర్ అధికార్ యాత్ర విజయ వంతమైందన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర ఒక సువర్ణ అధ్యాయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ కలిసి చేసిన ఓట్ చోరీ ఉదంతాన్ని దేశ ప్రజలకు తెలియజేయడంలో, న్యాయ వ్యవస్థ ముందు పెట్టడంలో ఓటర్ అధికార్ యాత్ర విజయం సాధించిందని అన్నారు. ఇది దేశ ప్రజలందరి విజయమని అన్నారు.


ట్యాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- లావేరు

పరిశ్రమలు యాజమాన్యాలు సమాజ శ్రేయస్సుకు తమవంతుగా అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని తాళ్లవలసలో అరబిందో ఫార్మా కంపెని సౌజన్యంతో రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు నారాయణరావు, శివశంకర్‌లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఆయా పరిశ్రమలు యాజమాన్యాలు ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని గ్రామాలు అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, ఆర్.ప్రకాశరావు, గురుగుబిల్లి సర్పంచ్ బాడిత లక్ష్మణరావు, పిషిని దేవివరప్రసాద్, ఎంపిటిసి ముళ్ల సాయికుమార్ పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉత్తీర్ణత అభ్యర్థికి అభినందనలు

మండలంలోని తాళ్లావలసకు డిఎస్‌సి ఉత్తీర్ణత అభ్యర్థి పిషిని దేవీవరప్రసాద్‌ను అభినందించారు. జిల్లాలో రెండో ర్యాంకు సాధించి ఉపాధ్యాయ పోస్టుకు ఎంపిక కావడంపై దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఉద్యోగ విధినిర్వహణలో వృత్తిపై నిబద్ధతతో పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయునిగా రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాకపోకలు బంద్

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని పెద్దరోకలపల్లి పంచాయతీ పరిధి పెద్దరోకలపల్లి, సీతారాంపల్లి, రాంనగరం గ్రామాలు మరల ముంపు బారిన పడ్డాయి. మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాల కారణంగా సమీపంలో ఉన్న సంపెమ్మగెడ్డ పొంగి ప్రవహించడంతో రోడ్డు మార్గం మూసుకుపోయింది. దీంతో పైమూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి సమస్య పునరావృతం కావడంతో బుధవారం సాయంత్రం వరకు నీరు నిలిచిపోయి ఉంది. ప్రతి చిన్న పనికీ ఇటు టెక్కలి, అటు పలాస వెళ్లాల్సిన గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. రెండు దశాబ్దాల నుంచి ఈ రోడ్డుపై వంతెన నిర్మాణం చేపడతామని పాలకుల మాటలు హామీకే పరిమితమయ్యాయి. ఏటా వర్షాల కారణంగా పై గ్రామాలకు చెందినవారు ఇబ్బందులని ఎదుర్కొంటున్నారు. గెడ్డ పొంగి పొరలడం వల్ల నౌపడ ఆర్ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులూ చదువులకు దూరం కాబోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు అధికారులు దృష్టిసారించి తమ రోడ్డుపై వంతెన నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


రోడ్డుమీదుగా ప్రవహిస్తున్న నీరు

నందిగాం : మండలంలోని పెద్ద తామరపల్లి-తుమ్మికొండ ఆర్అండ్‌బి రహదారిపై కైజాల వద్ద జంగం గెడ్డ పొంగిపొర్లుతోంది. కైజోల హర్షబాడా, సవరలింగుపురం, మలియాలింగిపురం, వీరాపురం, కల్లాడ తదితర గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. నీరు ఎక్కువగా ప్రవహించడంతో పది కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. జంగం గెడ్డపై శాశ్వత ప్రాతిపదికన వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవిష్యత్ కోసం కలలు కనాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఎచ్చెర్ల: విద్యార్థులు భవిష్యత్ కోసం కలలు కనాలని మోటివేషన్ స్పీకర్ డాక్టర్ గుంపా నాగేశ్వరరావు, గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. మండలంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇండక్షన్ కమ్ ఓరియన్‌టేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను విశాలంగా నిర్దేశించుకోవాలని అన్నారు. చెడు ఆలోచనలకు తావివ్వకూడదని సూచించారు. గొప్ప ఆలోచనలు మీ జీవితాన్ని తీర్చిదిద్దుతాయని, విజయం వైపు నడిపిస్తాయని, మిమ్మల్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాయని చెప్పారు. ఆలోచనలను మెరుగుపరచుకోవడానికి నిరంతర పరిశోధన, అనుకున్న లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించడం, సానుకూల ఆలోచనలను అలవర్చుకోవడం అవసరమని అన్నారు. మీ బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఇటువంటి కార్యక్రమం తరచూ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

9న ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్, సైన్స్ కళాలలకు చెందిన వివిధ విభాగాల్లోని సబ్జెక్టు కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఖాళీల భర్తీకి ఈ నెల 9న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచారి పి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. సిఎస్ఇ, ఎంసిఎ కోర్టుల్లో ఆరు, ఇసిఇలో నాలుగు, మెకానికల్‌లో రెండు, సివిల్‌లో రెండు, మైక్రోబయాలజీలో ఒక పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు నేరుగా హాజరు కావచ్చునని తెలియజేశారు. మరిన్ని వివరాలకు క్యాంపస్‌లోని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ కార్యాలయాలను సంప్రదించాలని రిజిస్ట్రార్ సూచించారు.


ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

పాఠశాలలోకి వరద నీరు

వజ్రపుకొత్తూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షం నీటితో నగరంపల్లి ప్రాథమిక పాఠశాల వాన నీరుతో ముంచెత్తింది. బుధవారం గ్రామంలోని వరద నీరు పాఠశాల భవనాల్లోకి చేరింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడ్డారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 24 మంది విద్యార్థులు ఉన్నారు. వరద నీటిని ఆయిల్ ఇంజిన్ల సహకారంతో బయటకు తోడే ఏర్పాట్లు చేశారు. భవనాలు లోతట్టు ప్రాంతంలో ఉండటం వల్ల వర్షాకాలంలో నీరు చేరిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నారని స్థానికులు తెలిపారు. నూతన భవనాలు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని అన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రకాష్

జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని భైరిపురానికి చెందిన పిరియా అమీన్ భార్య లక్ష్మమ్మ (78) ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న జెడ్‌పి చైర్పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ బుధవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు వైకుంఠరావు, తేజేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి ఆనందరావును పరామర్శించి ఓదార్చారు. ఆమె మృతిపై తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, నాయకులు పాండవ చంద్రశేఖర్, పులకల శ్రీరాములు, యలమంచి నీలయ్య, జల్లు యుగంధర్, కడియాల బాబురావు, బదకల భాస్కరరావు, సనపల శ్రీనివాసరావు, మాదిన శ్రీనివాసరావు, పుల్లట ప్రసాద్, పుల్లట రామ్ ప్రసాద్, యలమంచి సత్యం, ధనుంజయరావు, వై.ధోనీ పాల్గొన్నారు.


ఎరువుల కోసం వేచి ఉన్న రైతులు

ఎరువుల కోసం అవస్థలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని నౌపడలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఇద్దరు ఎరువుల డీలర్లు షాపులు మూసివేశారు. స్టాక్ ఉన్నా... రైతులు ఎరువుల కోసం బుధవారం పడిగాపులు కాశారు. కొద్దిసేపటి తర్వాత ఆధార్ కార్డు తీసుకొని రైతులకు యూరియా అందజేశారు. అయినా కొంతమందికి యూరియా అందకపోవడం రైతులు నిరాశతో వెనుదిరిగారు. రైతులకు యూరియా కొరతలేదని మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ చెబుతున్నా... వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై వ్యవసాయశాఖ అధికారులు స్పందించి తక్షణమే ఎరువులు అందించాలని రైతులు కోరుతున్నారు.

చేతి వృత్తుల విభాగ అధ్యక్షునిగా లక్ష్మణరావు


లక్ష్మణరావు

రణస్థలం: వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు టేకు లక్ష్మణరావు (బ్రహ్మాజీ) ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ చేతి వృత్తుల విభాగ అధ్యక్షునిగా నియమించినట్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసినందుకు గుర్తింపు దక్కిందన్నారు. పార్టీ కోసం, చేతి వృత్తుల కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపిది దిగజారుడు రాజకీయాలు

ప్రజాశక్తి- పొందూరు

వైసిపికి చెందిన ఇరువురు వ్యక్తుల మధ్య ఏర్పడిన స్థల వివాదం, కుటుంబ కలహాల కారణంగా మనస్థాపంతో వార్డు సభ్యుడు ఆత్మహత్యకు పాల్పడ్డారని, దానిని కూటమి నాయకులపై నెడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎఎంసి మాజీ చైర్మన్, ఎంపిటిసి మాజీ సభ్యులు అన్నెపు రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు మండల కేంద్రంలో బుధవారం కూటమి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ధర్మపురానికి చెందిన వార్డు సభ్యుడు మొదలవలస వరహానర్సింహులు కుటుంబ కలహాలు, ఆరోగ్య సమస్యలు, తమ వైసిపి పార్టీకే చెందిన నాయకులతో తలెత్తిన స్థల వివాదం కారణంగా ఆత్యహత్యకు పాల్పడ్డాడని అన్నారు. కనిమెట్టకు చెందిన అన్నెపు గిరి, మృతుడు వరహానర్సింహులు ఇరువురికి స్థల వివాదం ఉందని, ఇరువురు వైసిపికి చెందిన వారేనని తెలిపారు. గ్రామ పెద్దగా ఉన్న తనను సమస్య పరిష్కారానికి పిలవగా, తనకు కుదరక వెళ్లలేదని అన్నారు. దీంతో వైసిపి ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కూటమి నాయకుల ఒత్తిడి కారణంగా మృతి చెందాడంటూ శవరాజకీయాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాము

కొత్తవలసలో కొట్లాట

ఆమదాలవలస : మండలంలోని కొత్తవలసలో బుధవారం కొట్లాటలో చోటు చేసుకుందని, ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. గ్రామంలోని రజకలు, కాలింగులు కొంతకాలం నుంచి ఏర్పడిన మనస్పర్థల వల్ల ఈ కొట్లాట జరిగినట్లు తెలిపారు. ఇరు గ్రూపుల మధ్య జరిగిన కొట్లాటలో ఒక తరగతిలో నలుగురు, మరో తరగతిలో ఆరుగురు గాయపడినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిలో అరసవెల్లి హరమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె ప్రస్తుతం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతుందన్నారు. రాజులమ్మ, దవళ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


సన్మానిస్తున్న ప్రదీప్

ఉత్తమ సేవకులకు సన్మానం

ఇచ్ఛాపురం: గురుమహోత్సవం సందర్భంగా 23వ వార్డు కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ ఆధ్వర్యాన బెల్లుపడ కాలనీలో వివిధ హోదాల్లో ఉత్తమ సేవలు అందించిన వ్యక్తులకు సన్మానించారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు అమ్మన్నమ్మ, సాయి, అంగన్వాడీ పూర్వ కార్యకర్త నాగరత్నం, పూర్వ ఆశ కార్యకర్త శోభారాణి, పాలెపు సాయి జగదీష్‌లకు బుధవారం దుశ్శాలు కప్పి సన్మానించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ అప్పారావు, వార్డు ఇన్‌ఛార్జి సంతోష్ రథో, వార్డు పెద్దలు గువ్వాడ దిలీప్‌కుమార్, గవరయ్య, మల్ల వైకుంఠరావు, శాసన శేఖర్, పాలెప్ దివాకర్, శంకర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిశీలన


చర్చిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి- కొత్తూరు

కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కమిటీ వేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ఎస్.వి.ఎస్.స్వామిలు బుధవారం పరిశీలించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావులతో కమిటీ చర్చించింది. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, అగతముడి అరుణ్‌కుమార్, లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, టి.తిరుపతిరావు, గడ్డవలస కమలాకరరావు, ఆరుబోలు దశరథ, చోడవరపు రాము, పడాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

రియల్‌కు అడ్డాగా కంబిరిగాం భూములు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని కంబిరిగాం భూములు రైతులకు చెందాలని అప్పటి ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు పోరాటం చేశారు. ఇప్పుడు ఆ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కంబిరిగాం భూములు అడ్డాగా మారిపోతున్నాయి. రైతుల పక్షాన నిలబడి 1974 నుంచి సిపిఐ ఆధ్వర్యాన పోరాటం చేశారు. గతంలో రైతాంగానికి పనికి వచ్చే భూముల్లో జాతీయ రహదారి విస్తరణ చేపట్టడంతో ఈ భూముల రేట్లకు రెక్కలు వచ్చాయి. సమీపంలోని పలాస-కాశీబుగ్గకు చెందిన కొంత మంది దృష్టి ఈ విలువైన భూములపై పడింది. దీనిని ఎలాగైనా కాజేయాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. భూములకు అధిక ధరలు రావడంతో ఆఘమేఘాలపై కొంత మంది రెవెన్యూ అధికారులతో, రాజకీయ నాయకులతో చేతులు కలిపి బినామీ పేర్లతో భూములను కాజేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దశాబ్దాల తరబడి కంబిరిగాం భూ వివాదం సాగడం ఎట్టకేలకు కోర్టు ఆదేశాల మేరకు 2/3 వంతు చొప్పున్న రైతులు ఇనామ్ దారులకు వైసిపి పాలనలో రెవెన్యూ యంత్రాంగం భూ పంపిణీ చేసింది. భూ పంపిణీలో తమకు అన్యాయం జరిగిందని రైతులు గతంలో ఆవేదన వ్యక్తం చేశారు. కంబిరిగాం భూములు పంచుకున్న రైతులు కొంతమంది వ్యవసాయం చేస్తుండగా, ఇనామ్ దారులు మరి కొంతమంది రైతులు తమ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మకాలు చేశారు. కోట్లాది రూపాయలు విలువ గల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. కాశీబుగ్గకు చెందిన ఓ వ్యాపారి కంబిరిగాం చౌదరిల్ల వద్ద ఎకరా రూ.40 లక్షలకు రియల్ స్టేట్‌గా మార్చేసి కోట్లు కుమ్మరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.


మట్టిని తవ్వుతున్న రియల్ వ్యాపారులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

ఎచ్చెర్ల: మండలంలోని కొంగరాంలో ఆదర్శ రైతు గోపిన కృష్ణప్రసాద్ ఐదు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి లైన్ షోయింగ్ విధానంలో నాట్లు వేయిస్తున్నారు. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ, రీజనల్ ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రకాష్ క్షేత్రస్థాయిని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున జిల్లాలో ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూసారం పెరిగి పంట దిగుబడులు బాగా వస్తాయని అన్నారు. అలాగే విషతుల్యం లేని ఆహారం లభిస్తుందని తెలిపారు. రసాయన పద్ధతిలో పండించిన పంటలకు ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటల్లో చాలా వ్యత్యాసం ఉందని అన్నారు. ఖర్చు తగ్గి దిగుబడులు పెరుగుతాయని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి బి.రజని, ఎఒ వి.రాజేశ్వరరావు, ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ పాల్గొన్నారు.


గుళికలను పరిశీలిస్తున్న అధికారులు

మహిళల భద్రతకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మహిళల భద్రత, డ్రగ్స్ రహిత సమాజం తీర్చిదిద్దడంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని జిల్లా పోలీసులు పిలుపునిచ్చారు. ఎస్‌పి ఆదేశాల మేరకు శ్రీకాకుళం రెండో పట్టణ, గార పోలీసు స్టేషన్ పోలీసులు వారి పరిధిలోని కళాశాలలు, పాఠశాలలను బుధవారం సందర్శించారు. విద్యార్థులకు గంజాయి వంటి మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలు, మహిళ భద్రత, సైబర్ నేరాలపై, నారీశక్తి, సంకల్పంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టూ టౌన్ సిఐ ఈశ్వరరావు మాట్లాడుతూ మంచి చదువుతో, క్రీడలతో, సృజనాత్మకతతో జీవితాన్ని రూపొందించుకోవలన్నారు. విద్యార్థుల్లో స్వీయ నియంత్రణ, మంచి స్నేహ బంధం, మంచి విజయానికి ప్రాముఖ్యతను చూపుతాయన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గార ఎస్ఐ గంగ రాజు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం అత్యంత అవసరం అన్నారు.



మాట్లాడుతున్న పట్టణ సిఐ ఈశ్వరరావు

6న జాబ్‌మేళా

రణస్థలం: ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యాన ఈ నెల 6న రణస్థలం మండల కేంద్రంలోని సాయి డిగ్రీ కాలేజీలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెటిరో, టాటా ఎలక్ట్రానిక్ వంటి 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈ అవకాశాన్ని ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నిరుద్యోగులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి వివేకానంద

చిన్న బడ్జెట్ చిత్రాలను ప్రోత్సహించాలి

శ్రీకాకుళం సిటీ: చిన్న బడ్జెట్ చిత్రాలు ఆదరించి అక్కున చేర్చుకుని వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలని శ్రీకాకుళం డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వివేకానంద కోరారు. ట్రిగ్గర్ పాయింట్ మూవీ పోస్టర్ రిలీజ్‌ను స్థానిక జిల్లా గ్రంథాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సినిమాని శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో తీసి ఎంతోమంది కళాకారులను ప్రోత్సహించడం నిర్మాతకు ఎంత అభిమానం ఉందో తెలుస్తుందన్నారు. కార్యమ్రకంలో ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.జోగినాయుడు, వాకార్స్ క్లబ్ గవర్నర్ గేదల ఇందిరాప్రసాద్, ఆరోహి సంగీత కళాశాల విద్వాంసులు పెంకి నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ అధికారి బి.భాస్కరరావు పాల్గొన్నారు.


తాటి టెంకలను నాటుతున్న కూలీలు

తాటి చెట్టుకు విపత్తులు తట్టుకునే శక్తి

పోలాకి : విపత్తులను తట్టుకునే శక్తి తాటి చెట్లకు ఉందని టెక్కలి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ జగదీశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తరేవు నుంచి జోగంపేట వరకు ఉన్న సముద్ర తీరంలో బుధవారం తాటి టెంకలను నాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోనుటకు తాటి చెట్లు పెంచేందుకు ఏడు హెక్టార్లలో టెంకలు నాటించామని తెలిపారు. మెరక ప్రాంతాల్లోని తాటి చెట్ల వద్ద నుంచి టెంకలను సేకరించామన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న యువకులు

లడ్డూ పాటకు ఆ'ధర'ణ

కవిటి: మండలంలోని కొత్తవరకలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలంలో గ్రామానికి చెందిన మార్పు అప్పలస్వామి రూ.46,500లకు దక్కించుకున్నారు. అనంతరం మేళతాళాలతో గణేష్ నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక పూజా కమిటీ, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కవిటి కొత్తూరు పులకల వీధిలో జరిగిన వినాయక లడ్డు వేలం పాటలో దున్న రంగారావు రూ.45 వేలకు సొంతం చేసుకున్నారు.

రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యాన...

రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యాన కవిటి పల్లి వీధిలో నిర్వహించిన లడ్డు వేలంలో మొదటి లడ్డు సూరి అర్జునరావు దమయంతి దంపతులు రూ.45,501లకు దక్కించుకోగా, రెండో లడ్డు పొల్లాయి బాగుతి సింహాద్రి దంపతులు రూ.15,501 దక్షించుకున్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ నాయుడు పి.లక్ష్మణమూర్తి, పెద్దలు పి.సింహాచలం, పి.దేవరాజ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాశీబుగ్గ నుంచి తాళభద్రకు వెళ్లే రోడ్డు విపరీతంగా గోతులు ఏర్పడడంతో వర్షపు నీరు నిలిచిపోతుంది. తాళభద్ర గేట్ నుంచి గ్రామానికి వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగానే ఉంది. నిత్యం ఈ రోడ్లపై వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న పట్టణ రోడ్డు


సంతబొమ్మాళి : కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని నౌపడ పంచాయతీలో రేషన్ షాప్ వద్ద టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి, కర్రి విష్ణుమూర్తిలు బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించి రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డు విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. లబ్ధిదారులందరికీ డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు కె.శేషగిరిరావు, కె.శివానందరెడ్డి, బి.విజయకుమారి, టిడిపి నాయకులు వాడరేవు కృష్ణారావు, జనసేన నాయకులు ఎల్.కుమార్, విఆర్ఒ మంగులు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీరామ్ పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలం డీలర్ దుక్క అప్పారావు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.


నందిగాం : మండలంలోని శివరాంపురం, బడబంద, కోటిపల్లి, కోటియకొండపేట గ్రామాల్లో సర్పంచ్ సబ్బి జానకిరామ్ 282 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని మలకాం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పొందూరు అప్పారావు, మెగదాల రమణరావు, మరళీమోహనరావు, పప్పల సత్యనారాయణ, దుప్పల గౌరీ, పుష్పలత లను దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడ శ్రీనివాసరావు, ఎంఇఒలు వాగ్దేవి, పి.రాజారావు, పిఎంసి చైర్మన్ నగేష్, వైస్ చైర్మన్ దండా సునీత, పాఠశాల స్థలదాత అల్లంశెట్టి విజయకుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని పొల్లాడ ఎంపియుపి స్కూల్‌లో పనిచేసి ఇటీవల బదిలీపై ఉపాధ్యాయులు వెళ్లారు. ఈ మేరకు ఉపాధ్యాయులు చింత అప్పారావు, గిరిధర్, కవీశ్వర్, కె.లక్ష్మిలను బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ గోవిందరావు, మాజీ సర్పంచ్ అట్టాడ రఘుపతిరావు, విద్యా కమిటీ చైర్మన్ అట్టాడ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు హరికృష్ణ, వేణు పాల్గొన్నారు.


పొందూరు : సన్మానిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మోహిని

చట్టాలపై అవగాహన

పొందూరు: విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌ఛార్జ్ ఎస్ఐ మోహిని అన్నారు. పొందూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నారీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాలల అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నిర్మూలన వంటి పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు గీత, మహిళా పోలీస్ ఎం.లావణ్య పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

కోటబొమ్మాళి: ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు ఈ-పంట నమోదును తమ రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఎఒ ఎస్.గోవిందరావు సూచించారు. మండలంలోని చిన్నసాన సచివాలయం పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫులో రైతుల సాగు చేస్తున్న వరి పంటకు పోటాష్ లోపం ఉందని, వాటికి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహేశ్వరికి సన్మానం

ఇచ్ఛాపురం : మండలంలో మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాసుపత్రి మహేశ్వరి హిందీ ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆమెకు ప్రధానోపాధ్యాయులు భార్గవి, సర్పంచ్ సర్పంచి పిట్టా శేషిరేఖ, అధ్యాపకులు మహేశ్వరి దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసంతి, లలిత, గణపతి, కవిరాజు, ఉమాశంకర్, అమూల్య, జయవాణి, రీనా, స్వాతి, రమేష్, శ్రీనివాస్, మురళి, విద్యా కమిటీ అధ్యక్షులు మాయవతి, ఉపాధ్యక్షులు భారతి, సర్పంచ్ ప్రతినిధి పిట్ట మామయ్య, గ్రామపెద్దలు చంద్రశేఖర్, భీమారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: కవిటి మండలం భైరిపురం 11కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్‌ఎస్ పనులు నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజపురం సబ్ స్టేషన్ పరిధిలోని కాపాసుకుద్ది, కొరికానపుట్టుగ, ముత్యాలపేట గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.


అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలంలోని రాపాకలో వినాయకచవితి మహోత్సవాలు సందర్భంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి విద్యార్థుల ప్రతిభ

కోటబొమ్మాళి: వినాయక నవరాత్రుల్లో భాగంగా మండలంలోని బొడ్డపాడుకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సంతబొమ్మాళి మండల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. కోటబొమ్మాళి మండల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. వీరికి ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు సిమ్మన్న, చందు, సుబ్బన్న, సూర్యనారాయణ, షణ్ముఖ, విజయ్, కాళిదాస్, నరిసింహామూర్తి, అశోక్ పాల్గొన్నారు.

పొందూరు ఎంపిడిఓగా సింహాచలం

పొందూరు: పొందూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.సింహాచలం బుధవారం బాధ్యతలను చేపట్టారు. డిప్యూటీ ఎంపిడిఓగా ఉన్న ఆయన ఎంపిడిఓగా పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి పూర్తిస్థాయిలో తన వంతు శ్రమిస్తానని అన్నారు. కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.


సింహాచలం, ఎంపిడిఓ

ఉత్సాహంగా డాన్స్ పోటీలు

పోలాకి: పోలాకి కేంద్రంలో విశ్వేశ్వర నగర్ కాలనీలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిన్నారులతో డాన్స్ పోటీలు నిర్వహించారు. చిన్నపిల్లలు వేసిన వేషధారణ, నృత్యాలు ఆకర్షణీయంగా నిలిచాయి. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కమిటీ సభ్యులు అందజేశారు. అలాగే గురువారం అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు విద్య కంటే మెరుగైన విద్య అందించడానికి కృషి చేయాలని మండల విద్యా క్లస్టర్ హెచ్ఎం ఎన్.కృష్ణారావు ఉపాధ్యాయులకు సూచించారు. క్లస్టర్ పరిధిలోని నందికొండ ప్రభుత్వ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు విభాగాలకు చెందిన ప్రశ్నలు సంధించి జవాబులు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో నిర్వాహకులు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఆర్ఎంటి బెండి చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు వివేక్ సుధ పాల్గొన్నారు.

పలాస : పాఠశాలల్లో విద్యార్థులు పెట్టే భోజనం రుచిగా ఉండాలని ఎంఇఓ సిహెచ్.శ్రీనివాసరావు సూచించారు. కాశీబుగ్గ తాళభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అంతకుముందు పాఠశాల తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఉపాధ్యాయులు చక్కగా పాఠాలు బోధిస్తున్నారా? చెప్పిన పాఠాలు అర్థం చేసుకుంటున్నారా? తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.


పలాస : మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీనివాసరావు

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


నియామకపత్రాలు అందుకుంటున్న కార్యవర్గ సభ్యులు

ఇచ్ఛాపురం : అఖిల భారత యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో యాదవ భవనంలో రాష్ట్ర అధ్యక్షులు గద్దెబోయిన గురునాథ్ యాదవ్, జిల్లా అధ్యక్షులు గద్దెబోయిన కృష్ణ యాదవ్ ఆధ్వర్యాన బుధవారం యాదవ సభలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇచ్ఛాపురం నుంచి రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజును జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, నియోజకవర్గం అధ్యక్షునిగా జన్నెలా సంతోష్ కుమార్, మున్సిపాలిటీ అధ్యక్షునిగా సాలిన జగదీష్ యాదవ్, మండల అధ్యక్షునిగా కాళ్ల సంతోష్ కుమార్, కంచిలి మండలం అధ్యక్షునిగా తలగాన వాసుదేవ్, కవిటి మండల అధ్యక్షునిగా నర్తు జోగారావు, సోంపేట మండల అధ్యక్షునిగా కొల్లి దివాకర్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నియామకపత్రాలను అందజేశారు.

పలువురు ఆర్థికసాయం

శ్రీకాకుళం సిటీ: గత నెలలో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం మెడికవర్‌లో చికిత్స పొందుతున్న చల్లపేట పంచాయతీ జిమ్ముకు చెందిన సాధు సోమేశ్వరరావుకు రూ.90 వేలు బుధవారం వితరణగా అందజేశారు. జిల్లాలోని టెక్నీషియన్లు ఈ మొత్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో మొబైల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షులు దాము, ట్రెజరర్ పాపారావు, చిన్నారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో ఈదుపురానికి చెందిన రౌలో సంతోష్ ఇటీవల మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోవడంతో విషయం తెలుసుకున్న ఈదుపురం డిఫెన్స్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు మృతునికి భార్య సుమిత్రకు రూ.పది వేలు బుధవారం ఆర్థికసాయం కార్యక్రమంలో అంబటి ఈశ్వరరావు, ఎం.కేశవరావు, బి.బాలకృష్ణ, దువ్వి నారాయణ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు


సన్మానిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నరసన్నపేట: నరసన్నపేట నియోజకవర్గం నుంచి కూరాకుల, పొందరి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడ గొల్లపూడి బిసి భవనంలో నిర్వహించిన ప్రమాణస్వీకారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ మేరకు చైర్మన్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

దీపాలతో వినాయక రూపం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అప్పాపురంలో కోదండ రామాలయంలో గణపతి నవరాత్రులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్, కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు దీపాలతో బుధవారం వినాయక చిత్రం, ఓంకారం స్వస్తిక్, త్రిశులం తదితర రూపాలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో శోభ సంతరించుకుంది గ్రామస్తులు ఆసక్తి తిలకిస్తూ సంబరపడ్డారు.



నేతాజీ విగ్రహావిష్కరణ

సంతబొమ్మాళి : మండలంలోని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్గీయ పొందల విశ్వేశ్వరరావు జ్ఞాపకార్థం నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని కీర్తి చక్ర అవార్డు గ్రహీత మేజర్ మల్లా రామగోపాల్ నాయుడు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పట్టుదల, క్రమశిక్షణ, కృషి, విజయానికి మార్గమని సందేశమిచ్చారు. సర్పంచ్ అట్టాడ తిరుపతిరావు, ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న పాల్గొన్నారు.


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాంగోపాల్ నాయుడు

తూర్పుగోదావరిలో ఎచ్చెర్ల వాసి మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల



మండలంలోని అజ్జారం గ్రామానికి చెందిన జీరు లక్ష్మణరావు (29) తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణపాలెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. లక్ష్మణరావుకు చిన్నప్పటి నుంచి డాన్స్ అంటే ఆసక్తి కావడంతో తన చదువు డిప్లమా అనంతరం తన స్నేహితులతో కలిసి ఈవెంట్ పేరుతో వివిధ శుభకార్యాలకు, జాతరలకు వెళ్లి డాన్స్ చేసేవాడు. ఈ క్రమంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరులో జరిగే కార్యక్రమానికి ప్రదర్శన ఇచ్చేందుకు మంగళవారం బయలుదేరి వెళ్లాడు. ఈ క్రమంలో నెల్లూరు వద్ద కంటైనర్ లారీ వ్యాను ఢీకొన్నాయి. ఈ క్రమంలో వ్యాన్ నడుపుతున్న లక్ష్మణరావు తీవ్రంగా గాయపడి మృతి చెందారు. మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. మృతుడు లక్ష్మణరావుకు తండ్రి అసిరప్పడు, తల్లి లక్ష్మి ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


పరామర్శిస్తున్న కృష్ణదాస్

కృష్ణదాస్ పరామర్శ

టెక్కలి రూరల్ : మండలంలో పోలవరానికి చెందిన దవల రమేష్‌బాబు మంగళవారం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ బుధవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రమేష్‌బాబు మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్తారు సత్యం, కిల్లి అజయ్, చింతాడ గణపతి, రమేష్, గుండెల సుజాత తదితరులు పాల్గొన్నారు.


మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

దోమల నివారణకు చర్యలు

పొందూరు: మండలంలోని తండ్యాంలో సర్పంచ్ ప్రతినిధి కిల్లాన భాస్కరరావు ఆధ్వర్యాన బుధవారం దోమల నివారణ చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని నీటి నిల్వ ప్రాంతాలు, పిచ్చిమొక్కలు, కాలువల్లో, అపరిశుభ్ర ప్రదేశాల్లో దోమల మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.శంకరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'సజ్జల'ను కలిసిన అన్వేష్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజక వర్గంలో వైసిపి బలోపేతానికి కృషి చేయాలని వైసిపి అన్ని విభాగాల రాష్ట్ర అధ్యక్షులు సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారని వైసిపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రతి అన్వేష్ తెలిపారు. తాడేపల్లిలో బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అనుబంధ కమిటీల ఏర్పాటుతో సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్టు చెప్పారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న అన్వేష్